రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు..
- 13,175 మంది పరీక్ష రాయనున్న విద్యార్థులు
- సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్నపత్రాల విడుదల
- గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతి
- ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు

ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 26: రేపటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో ప్రాక్టికల్స్ పూర్తి చేశారు. పర్యావరణ విద్య పరీక్షలు సైతం పూర్తయ్యాయి. ఈనెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు.

పరీక్షలు రాయనున్న 13,175 మంది విద్యార్థులు

జిల్లాలో 58 కళాశాలల్లో 16 ప్రభుత్వ కళాశాలలు, 18 ప్రైవేటు కళాశాలలున్నాయి. మిగతావి కస్తుర్బా, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 13,175 మంది విద్యార్థులు (ఒకేషనల్ విద్యార్థులతో కలిపి) పరీక్షలు రాయనున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,507 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6,668 మంది ఉన్నారు. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ సెక్టరైనా మోడల్ పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గిరిజన గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. ఈ పరీక్షలకు సుమారు 700 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రశ్న పత్రాలను పరీక్షా సమయానికి 15 నిమిషాల ముందుగా సీసీ కెమెరాల నిఘాలో ప్రత్యేక అధికారులు విడుదల చేయనున్నారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం (జూనియర్ లెక్చరర్, డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్సై), నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 5 కస్టోడియన్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనున్నది. ప రీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని పోలీస్ శాఖ ఆదేశించింది.

హైపవర్ కమిటీ

పరీక్షల నిమిత్తం కలెక్టర్ చైర్మన్‌గా హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ఎస్పీ, ఇంటర్మీడియట్ రీజియన్ డైరెక్టర్, ఇంటర్ నోడల్ జిల్లా అధికారి సభ్యులుగా ఉంటారు.

పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి

పరీక్షలు ఈనెల 28న ప్రారంభమై మార్చి 19న ముగుస్తాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9 గంటలు దాటితే అనుమతించరు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. హాల్‌టికెట్లను సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు.

ప్రశాంతంగా పరీక్షలు నిర్వహిస్తాం..

ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తాం. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తిచేశాం. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నాం. గంట ముందే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తాం. సమయం దాటితే అనుమతించరు. విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

–ఇంటర్ నోడల్ అధికారి సత్యనారా యణ

కరాటేలో కస్తూర్బా బాలికల ప్రతిభ

పతకాలు సాధించిన బాలికలను అభినందిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి, ఫిబ్రవరి 26: నర్సాపూర్‌లో నిర్వహించిన కుంగ్‌ఫు లెజెండరీ మాస్టర్ బూమ్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఐదో నేషనల్ కరాటే పోటీల్లో వెల్దుర్తి కస్తూర్బా బాలికలు ప్రతిభ కనబర్చారు. 38 మంది బాలికలు వివిధ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఇందులో 25 మంది ప్రథమ, 8 మంది ద్వితీయ, ఐదుగురు తృతీయ స్థానాల్లో నిలిచారు. పోటీలో పాల్గొన్న ప్రతిఒక్కరూ పతకాలు సాధించడంపై ఎమ్మెల్యే సునీతారెడ్డి బాలికలను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ కమలను అభినందించారు.

మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించాలి

నర్సాపూర్, ఫిబ్రవరి 26: మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం నర్సాపూర్ ఒకటో వార్డులో మహిళా సమైక్య భవనం, వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నెలదొక్కుకోవడానికి స్వయం సహాయక సంఘాల్లో చేరారన్నారు. ఒకటో వార్డులో తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించుకున్నట్లు తెలిపారు.

పిల్లలను ప్రేమతో పెంచాలి

నర్సాపూర్, ఫిబ్రవరి 26 : పిల్లలను భయంతో కాకుండా ప్రేమతో పెంచితేనే ప్రయోజకులు అవుతారని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. నర్సాపూర్‌లోని డాన్‌బాస్కో స్కూల్‌లో తరంగ్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలతోపాటు బయటి ప్రపంచాన్ని చూపించాలన్నారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. పాఠశాల డైరెక్టర్ నర్సిరెడ్డి, కరస్పాండెంట్ యశ్వంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మేఘన, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్లు బుచ్చేశ్‌యాదవ్, రాంచందర్, ఎంపీటీసీ మేఘమాలకిషన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, బీఆర్‌ఎస్ నాయకులు జ్ఞానేశ్వర్, బాలరాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ మున్సిపల్ ఒకటో వార్డులో మహిళా సమైక్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

తల్లి మృతి చెందిన కొన్ని గంటల్లో కొడుకు..

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి, ఫిబ్రవరి 26: తల్లి అంత్యక్రియలు జరిగిన రాత్రి కొడుకు కూడా గుండెపోటుతో మృతి చెందిన ఘటన కౌడిపల్లిలో సోమవారం జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. కౌడిపల్లికి చెందిన దొంత లలిత (70) ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. తల్లి మరణం తట్టుకోలేక ఆమె కొడుకు నరేందర్ (45) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో మృతుడి భార్యాపిల్లలు ఒంటరి అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి

మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26: ఖైదీలకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ ఆదేశించారు. సోమవారం మెదక్‌లోని సబ్ జైల్‌ను ఆయన తనిఖీ చేశారు. జైల్లోని ఖైదీల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలకు అపాయిట్మెంట్, జైల్ అదాలత్, ఫీ బార్గెనింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రజీ మున్నిస్సా బేగం, రామ్‌శర్మ, సిద్దాగౌడ్, సిద్దిరాములు, జైలు సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప జాతర..

బీరప్పకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 26: గొల్లకురుమల ఆరాధ్యదైవం బీరప్ప జాతరను మాసాయిపేట మండలం కొప్పులపల్లిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కొలువైన బీరప్ప స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణ్యాన్ని ఘనంగా నిర్వహించి, బీరప్ప కథను ఒగ్గు కళాకారులు వినిపించారు.

వంద రోజుల పనిదినాలు కల్పిస్తాం

నిజాంపేట, ఫిబ్రవరి 26: నిజాంపేటలోని గఢీం చెరువులో ఎంపీటీసీ లహరి ఉపాధి పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్‌కార్డు కల్గిన ప్రతి కుటుంబానికీ 100 రోజుల పని కల్పిస్తామన్నారు. పూడికతీత పనుల్లో భాగంగా ఉపాధి కూలీలు తీసిన మట్టిని రైతులు తమ వ్యవసాయ భూముల్లో చల్లుకోవాలని, తద్వారా అధిగ దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిష్టారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఈపాస్‌తోనే ఎరువుల విక్రయాలు

నిజాంపేట, ఫిబ్రవరి 26: ఈ– పాస్ యంత్రాలతోనే రైతులకు ఎరువులు విక్రయించాలని ఇన్‌చార్జి ఏవో రాజ్‌నారాయణ డీలర్లకు సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఎరువులను విక్రయిస్తూ రికార్డులను ఎప్పటికప్పుడూ సరిచేసుకోవాలన్నారు. రైతులు తమ ఆధార్‌కార్డు నకలును దుకాణదారుడికి ఇచ్చి ఎరువులను పొందాలన్నారు.

గంజాయితో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

ఎస్పీ డాక్టర్ బాలస్వామి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26 : గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తాగి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఎస్పీ డాక్టర్ బాలస్వామి సోమవారం ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో గంజాయి చాకెట్ల వెలుగు చూస్తున్నాయని, ఆకు సిగరెట్లు, పొడి లిక్విడ్ రూపంలో గంజాయిని మాఫి యా రవాణా, అమ్మకాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దాన్ని ఇప్పుడు చాకెట్ల రూపంలోకి మార్చి పిల్లలను గంజాయికి బానిసలుగా మార్చుతున్నట్లు తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారిన కొంతమంది యువత బలహీనతను ఆసరాగా తీసుకుని గంజాయి మాఫియా రెచ్చిపోతున్నదన్నారు. అభివృద్ధికి అవరోధంగా మత్తు పదార్థాలు లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నదన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే మెదక్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657888కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26 : అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ డాక్టర్ బాలస్వామి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి పలువురు అర్జీదారులు ఫిర్యాదులు అందజేశారు. మెదక్‌కు చెందిన సారలక్ష్మి భర్త మరణాంతరం వారసత్వంగా రావాల్సిన ఆస్తిని తన భర్త అన్న శ్యాంసుందర్ పేరుపై అక్రమంగా మార్చుకున్నారని ఫిర్యాదు చేశారు.

డీసీఎం వ్యాన్, బైకు ఢీకొని మహిళ మృతి

చేగుంట, ఫిబ్రవరి 26: డీసీఎం వ్యాన్, బైకును ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన చేగుంట మండలంలోని వడియారం బైపాస్‌లో ఆదివారం రాత్రి జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాకకు చెందిన కరుమకుంట నిర్మల (38) భర్త కృష్ణ హైదరాబాద్‌లో నివాసిస్తున్నారు. పెద్దమల్లారెడ్డి, తూజాల్‌పూర్‌లో జరిగిన శుభకార్యానికి ద్విచక్రవాహనంపై భార్యాభర్తలు వెళ్లి తిరిగి హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. వడియారం బైపాస్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. దీంతో నిర్మల అక్కడిక్కడే మృతి చెందింది. కృష్ణకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజు తెలిపారు.

పురుగు మందు వికటించి ఎండిన వరి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26: వరి పైరుకు మొగి పురుగు సోకడంతో సూరారానికి చెందిన శ్రీశైలం తన పొలానికి చిన్నశంకరంపేటలోని శ్రీసాయి బాలాజీ పురుగు మందుల దుకాణంలో మొగి పురుగు నివారణ మందు తీసుకొచ్చాడు. వారి సూచనల మేరకు సోమవారం పిచికారీ చేసిన కొద్దిగంటల్లోనే వరి పైరు మొత్తం మాడిపోయింది. దీంతో మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రవీణ్‌కు ఫిర్యాదు చేయగా ఆయన వచ్చి పంట పొలాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో శాస్త్రవేత్తలు వచ్చి వరి పైరును పరిశీలించి, వారిచ్చిన నివేదిక ప్రకారం సదరు దుకాణ యజమానిపై చర్యలు తీసుకుంటారన్నారు.

త్వరగా సమస్యలు పరిష్కరించాలి

■ ప్రజావాణికి 81 అర్జీలు ■ కలెక్టర్ రాజర్షి షా

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ప్రజావాణితో సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 81 మంది నుంచి అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులు త్వరగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ పథకాలకు కావాల్సిన అర్హతలను బట్టి వారికి మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నాగయ్య కుల్చారం, బుజ్జి నర్సాపూర్, బాబురావు మనోహరాబాద్, గంగా భవానీ నర్సాపూర్, రాములు కుల్చారం నుంచి ధరణి, భూ సమస్యల పరిష్కారం కోసం 32 మంది, పార్శ రాములు రామాయంపేట, జయరాములు మెదక్, బాలమణి చేగుంట నుంచి పెన్షన్ కోసం 4 మంది దరఖాస్తులు చేసుకున్నారు. విద్య, వైద్య, ఉపాధి కోసం ఐదుగురు, ఇతర సమస్యల గురించి 40 మంది నుంచి అర్జీలు స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా మైనింగ్ అధికారి జయరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిశీలించిన అదనపు కలెక్టర్

చేగుంట మండలం బీ కొండాపూర్‌లోని ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

చేగుంట, ఫిబ్రవరి 26: పరిశ్రమలకు అనువైన స్థలం కోసం చేగుంట, మాసాయిపేట, చిన్నశంకరంపేట మండలాల్లోని ప్రభుత్వ భూములను మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశర్లు సోమవారం పరిశీలించారు. చేగుంట మండలంలోని బీ కొండాపూర్ గ్రామ పరిసర ప్రాంతాల్లోని సర్వే నంబర్ 68, 242, 629 గల భూమిలో సుమారు 1050 ఎకరాల ప్రభుత్వ భూమి పరిశీలించారు. ప్రభుత్వ భూమిని రైతులు సాగు చేసుకుంటున్నట్లు, పరిశ్రమలకు తమ భూమిని ఇవ్వలేమని రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, చేగుంట తహసీల్దార్ గయానిస్సాబేగం, ఆర్‌ఐ నర్సింగ్‌యాదవ్, సర్వేయర్ రవీందర్ రెడ్డి, టీఎస్‌ఐఐసీ భూగర్భ వనరుల శాఖ, పొల్యూషన్ శాఖల అధికారులు ఉన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26: జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు ఎన్ని ఎకరాల్లో ఉన్నాయో వివరాలు సేకరిస్తున్నామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేటలోని తహసీల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గతంలో లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చినప్పటికీ వాటిని వినియోగిస్తున్నారా లేదా పరిశీలిస్తున్నామన్నారు. అనంతరం సూరారం శివారులోని ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో అంబదాస్, రాజేశ్వర్, తహసీల్దార్ మన్నన్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ


అహ్మద్‌నగర్ పంచాయతీలో విచారణ చేపడుతున్న ఎంపీవో వైద్య శ్రీనివాస్

నర్సాపూర్, ఫిబ్రవరి 26: మండలంలోని అహ్మద్‌నగర్ పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ అవినీతికి పాల్పడుతున్నాడనే ఫిర్యాదుతో సోమవారం ఎంపీవో వైద్య శ్రీనివాస్ విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. కల్యాణలక్ష్మి, ఇంటి పన్ను వసూలు, ఇంటి నిర్మాణానికి అనుమతులు తదితర వాటిలో డబ్బులు తీసుకొని అవినీతికి పాల్పడ్డట్టు కలెక్టర్‌కు పంచాయతీ పాలక వర్గం రెండు నెలల క్రితం పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సాపూర్ ఎంపీవో వైద్య శ్రీనివాస్ ఆయనపై విచారణ చేపట్టారు. విషయంలో ఎంపీవోను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అహ్మద్‌నగర్ పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్‌ను విచారణ చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శిని పలు అంశాలపై విచారించగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదని తెలిపారు. గ్రామంలోని లబ్ధిదారుల వద్ద వివిధ పనుల నిమిత్తం కార్యదర్శికి డబ్బులిచ్చినట్లు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. పూర్తి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానన్నారు.

'డబుల్ బెడ్‌రూం' సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

రామాయంపేట, ఫిబ్రవరి 26: డబుల్‌బెడ్‌రూం ఇండ్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. సోమవారం రామాయంపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం డబుల్ బెడ్‌రూం కాలనీని సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న నీటి సమస్యతోపాటు ఇతర సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి సుప్రభాత రావు, మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదగిరి, గంగాధర్, సుందర్‌సింగ్, విప్లవ్, చింతల స్వామి, అల్లాడి వెంకటి, భైరంకుమార్, కుమార్‌సాగర్, శ్రీధర్‌రెడ్డి, ముత్యం రెడ్డి, సత్యనారాయణరెడ్డి, డాకి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామాయంపేట రూరల్, ఫిబ్రవరి 26: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని దామరచెర్వు, దామరచెర్వు గిరిజనతండా, కిషన్‌తండా, దంతేపల్లి తండా, కాట్రియాల తండాలకు రూ.కోటి 10లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలు, గిరిజన తండాలకు సీసీ రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య వచ్చినా తనను సంప్రదించాలన్నారు. గిరిజన తండాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానన్నారు. అనంతరం దామరచెర్వు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. మండలంలోని దామరచెర్వు గ్రామ మాజీ సర్పంచ్ పడాల శివప్రసాదరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నీటి వృథాను అరికట్టాలి

మెదక్‌రూరల్, ఫిబ్రవరి 26 : నీటి వృథాను అరికట్టాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. నేషనల్ వాటర్ మిషన్ జలశక్తి మంత్రిత్వ శాఖ నిధులతో నీరు, భూమి యాజమాన్యం శిక్షణ, పరిశోధన సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మెదక్ మండలంలోని ర్యాలమడుగు రైతు వేదికలో జిల్లాలోని ఏఈవోలకు నీటి యాజమాన్యం సంరక్షణపై సోమవారం శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో నేల, నీటి యాజమాన్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. రెండు రోజులపాటు శిక్షణ ఉంటుందని, ఏఈవోలు తప్పకుండా పాల్గొని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహాయ వ్యవసాయ అధికారి సునీత, మెదక్ ఏడీ విజయనిర్మల, అధికారులు వినయ్ కుమార్, సుబ్బారావు, ఏఈవోలు రాజశేఖర్, శరణ్య, శేఖర్ ఉన్నారు.

ఊరకుక్కల దాడి 21 గొర్రెలు మృతి

రామాయంపేట, ఫిబ్రవరి 26: ఊరకుక్కల దాడిలో 21 గొర్రెలు మృతి చెందిన ఘటన రామాయంపేట మండలం ఆర్. వెంకటాపూర్ గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కుర్మ నాగరాజు రాత్రంతా కొట్టంలోనే ఉండి తెల్లవారుజామున వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వచ్చి, చూడగా కుక్కలు గొర్రెలను చంపి తింటున్నాయి. ఇది గమనించిన నాగరాజు కర్రసాయంతో ఊర కుక్కలను వెళ్లగొట్టాడు. అప్పటికే 21 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

ఏడుపాయల హుండీ ఆదాయం రూ. 49 లక్షలు

పాపన్నపేట, ఫిబ్రవరి 26: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయ హుండీ ఆదాయం రూ.49.06 లక్షలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం గోకుల్ షెడ్డులో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. కార్యక్రమం లో దేవాదాయ శాఖ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.

పోతంశెట్‌పల్లి పెట్రోల్ బంక్ వద్ద ప్రమాదం

క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు, ఎస్సై మహ్మద్ గౌస్

కొల్చారం, ఫిబ్రవరి 26: మండలంలోని పోతంశెట్‌పల్లి చౌరస్తాలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో సోమవారం విద్యుత్ ప్రమాదం జరిగింది. ఈ ఘటన బంక్‌లో పని చేస్తున్న అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన గొల్పల మహేశ్, చిన్నాఘనపూర్ గ్రామానికి కడాల కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి మెదక్‌లోని జిల్లా దవాఖానకు తరలించారు. పెట్రోల్‌బంక్ మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు గొడవ చేశారు. ఎస్సై మహ్మద్ గౌస్ ఘటనా స్థలికి చేరుకుని జనాలను అక్కడి నుంచి పంపించేశారు. గాయపడ్డవారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. క్షతగాత్రుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్, కేసు నమోదు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26: మండలంలోని బాగీర్థిపల్లి శివారులో ఉన్న వాగు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం సీజ్ చేసినట్లు ఎస్సై నారాయణ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-AII

LOST

★ I, G.SATHISH MANOHAR, S/o. Late G.M. John, Aged about 50 years, R/o. Flat No. 5B-33, Lodha Bellezza, Kukatpally, Hyderabad have Lost My Document in Sangareddy on 19-02-24 (i) Original Sale Deed Document No. 1116 of 2001, Dated 09-02-2001 (ii) Original GPA bearing Document No. 144 of 1995, Dated 07-09-1995 both Registered before SRO Kukatpally. If anybody finds, pls. Contact: 9866331154.
NT-5807

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.